క్లుప్తంగా

నేటి నుంచి 'బేటీ బచావో.. బేటీ పఢావో'

ప్రత్తిపాడు: ఈ నెల 22వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి తెలిపారు. ఆరువారాల పాటు జరగనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఒక్కో వారం ఒక్కో యాక్టివిటీని అంగన్‌వాడీ, మండల స్థాయిల్లో నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగానే 24వ తేదీన ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం గ్రామాల్లో మహిళా విద్యపై అవగాహన, 25న యనమదల, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో రుతుక్రమ పరిశుభ్రతపై, 27వ తేదీన ప్రత్తిపాడు, గొట్టిపాడు గ్రామాల్లో నాప్‌కిన్స్ వినియోగంపై, 28న కోండ్రుపాడు, వంగిపురం గ్రామాల్లో జెండర్ సెన్సిటేషన్‌పై, 29న ప్రత్తిపాడు, గొట్టిపాడు గ్రామాల్లో పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పై, 30న నిమ్మగడ్డవారిపాలెం, కోయవారిపాలెం గ్రామాల్లో ప్లాంటేషన్ డ్రైవ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా కార్యక్రమాలను చేపట్టాలని సీడీపీఓ ఆదేశించారు.

పెట్రోలు బంకుల నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి



కాకుమాను: పెట్రోల్ బంకులు నిర్మించుకునే వారు తప్పనిసరిగా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించాలని అసిస్టెంట్ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ అన్నారు. మండల కేంద్రం కాకుమానులో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెట్రోల్ బంకులు గ్రామ శివారులోనే ఉండాలని, అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి కట్టడాలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు వచ్చినా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.వెంకటస్వామి, సిబ్బంది ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థినికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషిచేస్తుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. మంగళవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 43 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఏడాదికి రూ 2.5 లక్షల వార్షిక వేతనంతో సంస్థ విద్యార్థినులతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థినులను కళాశాల ఉపాధికల్పనాధికారి డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, అధ్యాపకులు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

గుంటూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఓబులనాయుడు పాలెం సమీపంలో ఎన్‌హెచ్-16లో యువకుడు రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామకృష్ణ మృతి తీరనిలోటు

ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు మృతికి పలువురు నివాళులు

చేబ్రోలు: సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఏపీఎస్ఆర్టీసీ (ఎస్‌డబ్ల్యూఎఫ్) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రామకృష్ణ ఆకస్మికంగా మృతి చెందటం ఫెడరేషన్‌కు తీరని లోటు అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.నేతాజీలు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన సీఐటీయూ అనుబంధ సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రామకృష్ణ గుండెపోటుతో మంగళవారం ఆకస్మికంగా మరణించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ నాయకులు, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, బంధువులు, గ్రామస్థులు రామకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్, జిల్లా నాయకులు మధుసూధన రావు, వి.రెడ్డి, శ్రీనివాసరావు, కె.గంగాధర రావు, ఆర్టీసీ ఉద్యోగులు, గుంటూరు 1 డిపో మేనేజర్ ఎం.వి.రామకృష్ణ, ట్రాఫిక్ విభాగం ఇంఛార్జి నరసింహారావు తదితరులు నివాళులు అర్పించారు.

అభివృద్ధికి పన్ను పోటు!

- ఆస్తి పన్ను లక్ష్యదూరం
- వసూళ్లలో పొన్నూరు పురపాలక సంఘం సిబ్బంది అంతులేని నిర్లక్ష్యం
- బకాయిలు రూ.2.48 కోట్లు
- అభివృద్ధి కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం



పొన్నూరు కూరగాయల మార్కెట్‌లో శిథిలావస్థకు చేరిన దుకాణాలు



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

పొన్నూరు: పొన్నూరు మున్సిపాలిటీలో ఇంటి పన్నులు, నీటి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. వివిధ రకాల మున్సిపల్ పన్నుల నుంచి వచ్చే ఆదాయాన్ని సిబ్బంది జీతాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయిస్తుంటారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం నుంచే అభివృద్ధి పనులకు కేటాయింపులు చేస్తుంటారు. అయితే మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లను చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. దానికి ప్రధాన కారణం గత కొంతకాలంగా వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఖజానాలో జమలు లేకపోవడంతో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కనీసం వీధిలైట్లు కూడా పూర్తి స్థాయిలో వెలుగులకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్లక్ష్యం బట్టబయలు...

పట్టణంలో 11,622 గృహాలు, దుకాణాలు ఉన్నాయి. 5059 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వాటికి సంబంధించి 2024 నుంచి 2025 వరకు ఇంటి పన్నులు, నీటి పన్నులు రూ. 5,64,89,950లు వసూలు చేయాల్సి ఉండగా, కేవలం రూ.3,16,14600 మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.2,48,74,495లు బకాయిలు ఇంకా రావాల్సి ఉంది. వీటిలో నీటి పన్ను రూ. 1,31,43,000 కేవలం రూ.31,83,000 మాత్రమే వసూలు చేయడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. గత ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి రూ. 1,05,00,000 లక్షలు బకాయిలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు అనంతరం ఇంటి పన్ను, నీటి పన్నుల వసూళ్ల బాధ్యతను పట్టణంలోని 20 సచివాలయాల సిబ్బందికి అప్పగించినా ఆశించిన మేరకు లక్ష్యాలను చేరుకోకపోవడం గమనార్హం. వసూళ్ల నిర్వహణ సక్రమంగా లేకనే బకాయిలు పేరుకుపోతున్నాయని కార్యాలయ వర్గాలే చెబుతున్నాయి.

మరమ్మతులకు సైతం నోచుకోని వైనం..

పన్నులు సకాలంలో వసూలు జరిగితే మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులు చేయించేందుకు అవకాశం ఉంది. ఖజానాలో నిధులు పుష్కలంగా లేని కారణంగా అభివృద్ధితో పాటు ప్రతి నెలా జీతాలు చెల్లించేందుకే ఇబ్బందులు పడే సందర్భాలు నెలకొంటున్నాయి. ప్రధానంగా వీధిలైట్లు, పురపాలక సంఘానికి ఆదాయాన్ని సమకూర్చే దుకాణ సముదాయాలు కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన సెంటర్లలోని కూరగాయల మార్కెట్, మటన్ మార్కెట్ దుకాణ సముదాయాలు అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరాయి. నిధుల లేమితో కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు.

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం

నిలిచిపోయిన పన్నుల వసూళ్ల కోసం సచివాలయ టీంలను ఏర్పాటు చేశాం. ప్రజలకు అవగాహన కల్పించి పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కోరుతూ ఇంటి, నీటి పన్నులను వసూలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. ఫిబ్రవరి, మార్చిలలో పన్ను వసూళ్లను వేగవంతం చేసి రావాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– తోట వెంకటేశ్వరరావు,
ఆర్ఓ, పొన్నూరు మున్సిపాలిటీ

విజ్ఞాన్- బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ అవగాహన ఒప్పందం



అవగాహన పత్రాలను మార్చుకుంటున్న వీసీ పి.నాగభూషణ్, మురళీకృష్ణ మీనన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ – బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్‌అండ్‌డీ వైస్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ మీనన్, బిజినెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్ట్రాటజిక్ సర్వీసెస్ హెడ్ మనోగరన్‌లతో విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చునన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ఈ సందర్భంగా బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్ అండ్ డీ వైస్ ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: విశాఖపట్నంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరుగనున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర మహా సభల పోస్టర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు బుధవారం ఆవిష్కరించారు. సంఘం వర్సిటీ శాఖ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ మహాసభలలో 1200 మంది ప్రతినిధులు పాల్గొనున్నారని తెలిపారు. మహాసభలలో విద్యారంగ సమస్యలు, విద్యారంగ స్థితి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించునున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ శాఖ వైస్ ప్రెసిడెంట్ మనికంఠ, జాయింట్ సెక్రటరీ గంగాధర్, సాయి, అక్షయ కుమార్, శివరామరాజు, గణేష్ పాల్గొన్నారు.

ఆటోవర్కర్ల మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరించిన ఆటో యూనియన్ నాయకులు

పొన్నూరు: ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు అన్నారు. ఈ నెల 24వ తేదీన గుంటూరు సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్న ఆటో డ్రైవర్లు, వర్కర్లు యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ 21,31 నెంబరు జీఓలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు అరేటి రామారావు మాట్లాడుతూ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు మంగా శ్రీనివాసరావు, సుబ్బయ్య, వెంకయ్య, రత్న బాబు, సత్యన్నారాయణ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఎ.గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలకు ప్రాధాన్యం ఇవ్వాలి

డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్



చేబ్రోలు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను, నారాకోడూరు, వేజండ్ల గ్రామాల్లో గోకులం షెడ్లను మంగళవారం పీడీ శంకర్ పరిశీలించారు. మంచాల గ్రామంలో పంట కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. నారాకోడూరు, వేజండ్ల గ్రామాల్లో గోకులం షెడ్లను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. పీడీ శంకర్ వెంట ఎంపీడీఓ కె.లలిత, ఏపీఓ ఆనంద మోహన్, ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో ఈనిక దశ కీలకం

కాకుమాను: ప్రస్తుతం మొక్కజొన్న పంట ఈనిక దశలో ఉందని, ఈ దశలో రైతులు పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని కాకుమాను, పెద్దివారిపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న పంట ఈనిక దశలో ఉందని, ఈ సమయంలో పంటకు సరిపడా నీరు అందించాలని ఆమె సూచించారు. ఈనిక దశలో గింజ పాలుపోసుకునే సమయమని ఈ సమయంలో నీటితో పాటు పంటకు యూరియా, పొటాష్ ఎంతో అవసరమని ఆమె తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

పొన్నూరు: మండలంలోని కట్టెంపూడి, పచ్చల తాడిపర్రు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి పొలాలను సందర్శించి మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు ఉనికిని గమనించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఓ డేగల వెంకట్రామయ్య, రైతు సేవ కేంద్రం సిబ్బంది సురేష్ బాబు, సుమజ, గాంధీ, కట్టెంపూడి మాజీ సర్పంచ్ ఎక్కటి పద్మారావు, ఎక్కటి రామయ్య, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

గుంటూరు రూరల్: పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంకిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ టీచర్ ఆర్.విజయకుమారి తెలిపారు. మంగళవారం పాఠశాలలో బొమ్మలకు యూనిఫామ్ ధరించి, బొమ్మల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు సరోజని, ఉపాధ్యాయురాలు జయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కె.సాహితి

చేబ్రోలు: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు చేబ్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాహితి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై మండలాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతాంగం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం కాలంలో రైతులు రూ.1800 నుంచి రెండు వేలకు ధాన్యం విక్రయించుకున్నారని, కొనుగోలు కేంద్రాల ద్వారా కూడా సక్రమంగా కొనుగోలు చేయకపోవటానికి కారణమేమిటని ప్రశ్నించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్రహాం లింకన్, ఏపీఓ ఆనంద్ మోహన్, హౌసింగ్ ఏఈ ఓబుల్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావులు మాట్లాడారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు వారి శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై వివరించారు. ఎంపీడీఓ కె.లలిత, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వాలు

పెదకాకాని: అమలు కాని హామీలు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత, నిరుద్యోగులను మోసం చేశాయని ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య అన్నారు. పెదకాకాని పాతూరులో మంగళవారం 22వ అఖిల భారత యువజన సమైక్య రాష్ట్ర మహాసభలు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర యువజన సమైక్య ఏఐవైఎఫ్ మహాసభలు ఫిబ్రవరి 6వ తేది నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు గుంటూరు జిల్లాలోని యువజన సమైక్య సభ్యులందరూ సకాలంలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ఇస్తామని, నిరుద్యోగ భృతి కల్పిస్తామని యువతకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రాగానే యువకుల్ని మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పెండింగ్ లో ఉన్న ఉద్యోగాలు త్వరితగతిన భర్తీచేసి నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. రామిశెట్టి శ్రీనివాసరావు, పూల మాధవరావు, ఆర్.కళ్యాణ్, శ్రీనివాస్, ఎడ్లపల్లి సాయిరాం, కటారు వంశీ, షేక్ మున్నా పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు ఆపని కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కళ్యాణ్ బాబును పరామర్శిస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు పూర్తయినా ఇంకా ప్రతిపక్షంపై కక్షసాధింపు చర్యలకు, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఇటీవల కూటమి ప్రభుత్వ నాయకుల వల్ల ఇబ్బందులు పడి తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రత్తిపాడు మండలం, కొండేపాడు గ్రామానికి చెందిన దాసరి కళ్యాణ్‌బాబును బలసాని మంగళవారం పరామర్శించారు. గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కళ్యాణ్ బాబును పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునే విధంగా చూడాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ భూ వివాద కేసుల్లో అక్రమంగా కళ్యాణ్‌బాబును ఇరికించి, అదే గ్రామానికి చెందిన కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, మనోవేదన చెందిన కళ్యాణ్ బాబు సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. బాధితుడిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి, పార్టీ తరపున వారికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఆయనవెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో మంగళవారం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దీక్షా పరులు ఏర్పాటు చేసిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ..

వెల్లలూరులో పార్టీ నాయకుడు పుష్పాల బుచ్చయ్య మాతృమూర్తి మృతి సమాచారం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. 16వ వార్డుకు చెందిన పార్టీ నాయకుడు దేవరకొండ గోపి సోదరుడు మృతి చెందిన సమాచారం తెలుసుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా సక్రమంగా నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్ షేక్ అబ్దుల్ మతిన్ అన్నారు. గత కొంతకాలంగా మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో నీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంపై పలుమార్లు 'సాక్షి'లో కథనాలు వెలువడ్డాయి. గతంలో రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుండగా గత నాలుగు నెలలుగా మూడు రోజులకు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో నిరుపేదలు సైతం వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రక్షిత మంచినీటి పథకం పరిశీలనలో భాగంగా మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో మంచినీటి చెరువు, పంప్‌హౌస్, గుంటూరు ఛానల్(కొత్తకాలువ)ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గ్రామంలో నీటి సరఫరా చేసేందుకు అన్ని రకాల వనరులు ఉన్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారన్నారు. ఇటీవల గుంటూరు ఛానల్ వద్ద పంప్ హౌస్‌లో అమర్చిన కొత్త మోటారు ద్వారా రావాల్సిన నీటిలో 20 శాతం కూడా రావడం లేదన్నారు. పంచాయితీ నిర్వహణలో ఉన్న బోరు నీరు టెస్టింగ్ చేసి ఆ నీటిని కూడా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నూతనంగా మరో బోరు వేయించేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఫిల్టర్ బెడ్‌లలోకి చెరువు నీటిని పంపించాలా.. పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీటిని నేరుగా పంపింగ్ చేయాలా.. అనే అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సారిక, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

గొప్ప విప్లవ నాయకుడు లెనిన్

కాకుమాను: గొప్ప విప్లవ నాయకుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం జిల్లా నాయకుడు దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం లెనిన్ లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ బాబు మాట్లాడుతూ ప్రపంచంలో కారల్ మార్క్స్ రచించి, ప్రతిపాదించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని తొలుత సోవియట్ రష్యాలో విప్లవ పోరాటం ద్వారా అధికారంలోకి అమలు చేసిన ఘనత కామ్రేడ్ లెనిన్‌కే దక్కుతుందని ఆయన తెలిపారు. విప్లవ పథంలో అపజయాలు ఎదురైనా వాటిని పాఠాలుగా నేర్చుకుని లక్ష్యం చేరేవరకు పోరాడిన గొప్ప ఘనుడు లెనిన్ అని ఆయన కొనియాడారు. ప్రస్తుతం దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.గారపాటి రమేష్, జంపని రామారావు, కొత్త వెంకట శివ రావు, శ్రీనివాసరావు, భువనేశ్వరి పాల్గొన్నారు.

పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా ప్రవర్తించడం సరికాదు

జిల్లా గౌడ, బీసీ సంఘం నాయకులు



మాట్లాడుతున్న జిల్లా గౌడ, బీసీ సంఘం నాయకులు వీరంకి రంగారావు, మైలా రామరాజు

చేబ్రోలు: పొన్నూరు పట్టణ సీఐ, సిబ్బందిపై బార్ అసోసియేషన్ సభ్యులు అక్రమ కేసు బనయించి సస్పెండ్ చేయమని కోరటం దారుణం, అన్యాయమని జిల్లా గౌడ సంఘం మరియు బీసీ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. చేబ్రోలు మండలం వడ్లమూడి అడ్డరోడ్డులోని గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర మంగళవారం బీసీ, గౌడ సంఘం నాయకులు నిరసన తెలియజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తుళ్లూరు శ్రీనివాసరావు, యాదవ సంఘం జిల్లా నాయకులు మైలా వెంకట రామరాజు, గౌడ సంఘం రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ వీరంకి రంగారావు, గౌడ సంఘ నాయకులు రాయన రాంబాబు, పాలపర్తి ఏడుకొండలు తదితరులు మాట్లాడారు. సమాజాన్ని, ప్రజలను రక్షించే పోలీసుల యూనిఫామ్‌ను దిష్టిబొమ్మకు వేసి దహనం చేయటం పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం సమంజసం కాదని నాయకులు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com